# రేపటి కోసం

తెలుగు దినపత్రిక

ఆదివారం 7-7-2024 | www.repatikosam.com | పేజీలు : 4 | వెల : రూ.3.00 | సంపుటి: 7 సంచిక: 78






# అన్నదాత ఆనందం

# అపురూప క్షణాలు

రైతుల
కల ఈడేరిన వేళ...

వంశధార ఎడమ కాలువలో జలకళ

గంగమ్మ పరవళ్లు... ఇక సాగునీటికి ఢోకా లేదు

మోదుగులపుట్టి గ్రామం వద్ద
పలాస నియోజకవర్గంలోకి వంశధార ప్రవేశం

హారతులు పట్టి.. పసుపు, కుంకుమలతో మహిళల పూజలు

క్షీరాభిషేకం చేసిన రైతులు, కూటమి నేతలు

సర్వత్రా మార్మోగిన **జయహో శిరీష** నినాదం

నయా చరిత్రను లిఖించిన పలాస ఎమ్మెల్యే
గౌతు శిరీష

గత ఐదేళ్లలో సాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. వరి నారు మడి కట్టింది మొదలు ఇబ్బందులే. కానీ సేద్యానికి అలవాటైన బతుకులు మావి. వాతావరణం ప్రతికూలించినా ఎక్కడో చిన్న ఆశ... మంచి జరుగుతుందేమోనని... కానీ జరుగలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్నాం. వంశధార కాలువ అందుబాటులో ఉంది. కానీ అందులోంచి చుక్కనీరు రాలేదు. నారును బతికించుకునేందుకు బిందెలతో నీరు పట్టుకొచ్చి ఇంటిల్లపాదీ కష్టపడ్డాం. ఇక్కడి పాలకుడి దృష్టికి రైతుల సమస్యలను విన్నవించాం. కానీ అన్నదాత గోడు ఆయనకు పట్టలేదు. భజనపరులతో భజనలు చేయించుకుంటూ కాలం గడిపారే తప్ప, సాగుకు నీరివ్వలేదు. దుక్కి దున్నిన తర్వాత అరకొర వర్షాలు కురిశాయి. పుడమి తల్లిని నమ్ముకున్న అన్నదాత ముందడుగే వేశాడు. తీరా నాట్లు వేశాక మళ్లీ నీటి సమస్య తలెత్తింది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి బావుల నుంచి ఇంజిన్ల సాయంతో పొలానికి నీరు పెట్టాం. కానీ నీటి సామర్థ్యమున్న వనరులు లేకపోవడంతో అక్కడ కూడా నిరాశే ఎదురయ్యింది. తీరా పంట చేతికొచ్చిందా అంటే.. లేనే లేదు... చివరికి రైతు కష్టాన్ని పశువులకు దాణాగా విడిచిపెట్టాల్సిన దుస్థితి దాపురించింది. ఇలా ఒకటా.. రెండా... ఏకంగా ఐదేళ్లపాటు ఇదే పరిస్థితి. వంశధార నీరివ్వాలని అడిగితే ఎగువన పొరుగు నియోజకవర్గంలోని నాయకుడు లిఫ్టులు పెట్టేశారని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తనలోని నటుడ్ని బయటకు తీశారే తప్ప, పరిష్కారానికి మాత్రం దారి చూపలేదు. 2019కు ముందు కూడా అక్కడ ఎత్తిపోతల పథకాలున్నా పలాస నియోజకవర్గానికి వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా శివారు ప్రాంతానికి కూడా సాగునీరందించేవారు అప్పటి ఎమ్మెల్యే శివాజీ. వైసీపీ ప్రభుత్వ పాలనలో సాగునీరివ్వకుండా తమ లోపాలను పక్కనున్న వారిపై నెట్టేసేందుకు ప్రాధాన్యతనిచ్చారు. రాజకీయ పబ్బం గడుపుకొనేందుకు మాత్రమే రైతు సమస్యలను తెరపైకి తీసుకొచ్చారు. అయితే కనీసం ఆ కాలువలో పూడిక తీసి, జంగిల్ క్లియరెన్స్ చేపడితే రైతుకు నీరు అందుతుందని కనీస పరిజ్ఞానం లేని వ్యక్తి ఈ రాష్ట్రానికి మంత్రి అయ్యి కూర్చోవడం ప్రజలు చేసుకున్న పాపమే ముమ్మాటికీ. అయితే ప్రభుత్వం మారింది. గౌతు శిరీషమ్మ రైతు శ్రేయస్సు కోసం పాటుపడతారని ఊహించాం. ఆమె అధికారంలోకి వచ్చారు. ఐదేళ్లలో అప్పటి నాయకుడికి సాధ్య కానిది.. కేవలం నెల రోజులు పూర్తవ్వకుండానే సాగునీటిని అందించిన ఘనత శిరీషమ్మదే. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని అనే సంకల్పంతో ఆమె ఎన్నికలకు వెళ్లారు. అయితే విజయం సాధించాక తన మాటను నెరవేర్చుకునేందుకు చర్యలు చేపట్టారు. ప్రధానంగా వంశధార ఎడమ ప్రధాన కాలువపై ఫోకస్ చేశారు. ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా అధికారుల దృష్టికి రైతు సమస్యలను తీసుకెళ్లి నెల రోజుల్లోనే ఈ ప్రాంతానికి సాగునీరందించారు. రైతు కష్టం తెలిసిన నేతామె. ఆమె కష్టానికి ప్రతిరూపమే వంశధార కాలువలో నీటి పరవళ్లు. ఏదిఏమైనా రైతులకు సాగునీటిని అందించిన దేవతామె. రైతుల మదిలో ఆనందాన్ని నింపిన నేత గౌతు శిరీష.

- పలాస నియోజకవర్గంలో రైతుల అంతరంగమిది

2లో




# అన్నదాతే ఆనందం

## వంశధార ఎడమ కాలువలో జలకళ



పలాస, జూలై 6 (రేపటికోసం) :

**జూలై 6, 2024... ఇది ఒక తేదీ కాదు... ఓ చరిత్రకు సజీవ సాక్ష్యం. ఐదేళ్ల పాటు సాగునీటి కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన రైతుల పాలిట ఓ సువర్ణాధ్యాయం మొదలయ్యిందనేందుకు ఓ సూచిక. గత ఐదేళ్లుగా సాగునీటి కోసం నానా అవస్థలు పడిన అన్నదాత అవసరాలను గుర్తించిన ప్రభుత్వం ఓ నెల ముందుగానే సాగునీటిని విడుదల చేసి రైతుపక్షపాతిగా నిలిచింది. అయితే పట్టుమని పదిహేను రోజుల్లో పాడైన వంశధార ఎడమ ప్రధాన కాలువకు మరమ్మతులు చేయించి... ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కే సాగునీటిని అందించాలనే లక్ష్యంతో పని చేశారు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని అనే సంకల్పాన్ని సాకారం చేసేందుకు చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నారు శిరీష. తన తాత, తండ్రి మాదిరిగానే రైతుపక్షపాతిగా కొద్దిరోజుల్లోనే చెరగని ముద్ర వేసుకున్నారు. అయితే ఆమె కృషి మేరకు పలాస నియోజకవర్గంలోని రైతుల మోములో ఆనందం వెల్లివిరిసింది.**

వంశధార ఎడమ ప్రధాన కాలువకు గొట్టా బ్యారేజీ వద్ద నీటిని విడుదల చేయడంతో శనివారం నాటికి జలకళ సంతరించుకుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీకి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళలు, రైతులు పలాస మండలంలోని మోదుగులపుట్టి గ్రామం వద్దకు చేరుకుని ఆ గంగమ్మతల్లికి హారతులిచ్చి స్వాగతించారు. గంగమ్మకు పాలాభిషేకం చేసి... పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఈ ఏడాది వ్యవసాయ క్షేత్రాలన్నీ సస్యశ్యామలమవ్వాలని ఆకాంక్షించారు. గత ఐదేళ్లుగా సాగునీటి కోసం ఆత్రంగా ఎదురుచూసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం సాగుకు సహకరించలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వరినారు పోశాక వర్షాభావ పరిస్థితుల రీత్యా పంటలు ఎండిపోయేవని, ఈ క్రమంలో బావుల్లోను, చెరువుల్లోను ఇంజిన్లు వేసి పంటను బతికించుకోవాల్సి వచ్చేదని వాపోయారు. పెట్టుబడి భారీ స్థాయిలో పెరిగిపోయేవని, పంట కూడా చేతికి వచ్చేది కాదన్నారు. అయితే అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా పూర్తికాకమునుపే ప్రతి చేనుకు నీరు... ప్రతి చేతికి పని కల్పించేందుకు సంకల్పించిన పలాస ఎమ్మెల్యే రైతుల బాధలను తీర్చే దేవతగా అభివర్ణించారు. అన్నదాతకు పుష్కలంగా సాగునీరందించేందుకు ఆమె చేసిన కృషిని కూటమి నాయకులు, రైతులు అభినందించారు. అలాగే కూటమి నాయకులకు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులతో పాటు వంశధార అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

### చకచకా...



పని చేయించే ప్రభుత్వంలో పనులు ఎలా చకచకా జరుగుతాయో అందరికీ తెలిసిందే. మన ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే సాగునీరందించాం. వంశధార టెయిలెండ్‌కు నీరందడం ఆనందంగా ఉంది. ఇందుకు ప్రధాన కారకులైన చంద్రబాబునాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే వారి ఆదేశాలతో చకచకా పనులు పూర్తి చేసి, ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన కాలువలో చెత్తాచెదారాన్ని తొలగించి.. జంగిల్ క్లియరెన్స్ చేపట్టిన అధికారులకు రైతులందరి తరఫున ధన్యవాదాలు.

గత నాలుగేళ్లుగా మింగలేక మంగళవారం కబుర్లు చెప్పారు అప్పలరాజు. మంత్రిని అంటూ ముందొక కారు... వెనుకో పోలీసు కారు తప్పకోవడం కాదు. ప్రజల బాగు కోసం శ్రద్ధ పెడితే ఎలా పనిచేయాలో చూసి నేర్చుకోండి. భూ కబ్జాలు, కొండలు, కాలువలను మింగడంలో శ్రద్ధ చూపారు. ముఖ్యంగా మహిళనైన తనను సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిత్వ హననం చేస్తూ... అగౌరవ పరచాలని, ప్రజల్లో చులకన చేయాలని ఎన్నో కుయుక్తులు పన్నారు. ఆ పైశాచికానందం పొందిన శ్రద్ధలో కాస్త అయినా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టినా.. కనీసం పది శాతం నీరందించి ఉన్నా బాగుండేది. ఆడపిల్లనైన తనను ప్రజలు నమ్మి గెలిపించారు. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని అనే సంకల్పానికి ప్రోత్సాహాన్నిచ్చారు. తనపై నమ్మకముంచి గెలిపించిన పలాస ప్రజలకు కృతజ్ఞతలు. వంశధార ఎడమ కాలువ ద్వారా నీరందించేదుకు సహాయ సహకారాలందించిన రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా ఇరిగేషన్ అధికారులకు, అప్పటి కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. పనులు పూర్తి చేసేందుకు అధికారులను పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మరోమారు కృతజ్ఞతలు.

కుటుంబంతో తిరుమల శ్రీవారిని దర్శించుకునే క్రమంలో నీరు వచ్చే సమయంలో పలాసలో అందుబాటులో లేకపోయినప్పటికీ రైతులకు సాగునీరు అందించగలిగానని సంతృప్తిగా ఉంది. ఆ పండగలో కూటమి కుటుంబ సభ్యులంతా పాల్గొనడం ఆనందంగా ఉంది.

- గౌతు శిరీష, పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు.

### గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం




గత ఐదేళ్లలో వర్షాభావ పరిస్థితుల రీత్యా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సాగునీటి కాలువ ఉండి కూడా అందులో కూడా చుక్క నీరు రావడం లేదు. పొరుగు ప్రాంతాల వరకు సాగునీరు వచ్చేది. కానీ వంశధార ఎడమ కాలువ నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో నీరు రాలేదు. ఈ విషయమై అప్పటి పాలకునికి పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోలేదు. అయితే ఎమ్మెల్యేగా శిరీషమ్మ బాధ్యతలు స్వీకరించాక సాగుకు నీరందించారు. రైతుకు బాసటగా నిలిచారు. ఈ నీరు చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఓ రైతుగా ఈ కమనీయ దృశ్యాన్ని కనులారా చూసేందుకు మోదుగులపుట్టి గ్రామానికి వచ్చాను.

- గొనప కుమారస్వామి, రైతు, అంతరకుడ్డ.

### బాబుకు పాదాభివందనం




నీరు లేక ఇబ్బందులు పడ్డాం. పంటకు తడి అందించేందుకు రేయింబవళ్లు ఇంజిన్లు పెట్టాం. అయినా నీటి సామర్థ్యమున్న వనరులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులుపడ్డాం. నేనో కౌలు రైతును. పెట్టుబడులు పెట్టుకుని.. అప్పులపాలయ్యాం. కొద్దో గొప్పో పంట చేతికి వచ్చేది. శిరీషమ్మ దయతో ఈ ఏడాది నీరొచ్చింది. చాలా సంతోషంగా ఉంది. భగవంతునికి, చంద్రబాబు నాయుడికి పాదాభివందనం. గడచిన ఐదేళ్లలో మంత్రిగా ఉండి కూడా చేయలేని పనిని, ఓ సాధారణ ఎమ్మెల్యేగా... కేవలం పదిహేను రోజుల్లోనే నీరు తెప్పించారంటే శిరీషమ్మ రైతుల పట్ల ఎంత చిత్తశుద్ధితో ఉన్నారో ఇట్టే అర్థమవుతోంది.

- గున్న జోగారావు, రైతు, అంతరకుడ్డ.

### రైతు బాగుండాలనే తపన ఆమెది...



రైతన్న సుభిక్షింగా ఉండాలి. రైతు బాగుంటేనే మిగిలిన రంగాలు కూడా బాగుంటాయి. ఈ దిశగా ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఉన్నతమైన ఆలోచనలు చేశారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించారు. అయితే తాను అధికారంలోకి వస్తే **ప్రతి చేనుకి నీరు ప్రతి చేతికి పని** అనే సంకల్పంతో ముందుకెళ్లారు. మొట్టమొదటిసారిగా శిరీషమ్మ గెలిచిన 15 రోజుల్లో వంశధార జలాలను పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు మండలంలోని శివారు ప్రాంతానికి సాగునీరందించేందుకు వడివడిగా అడుగులు పడ్డాయి. ఈ ఖరీఫ్ సీజన్‌కు అన్నదాతకు పుష్కలంగా సాగునీరు అందుతోంది. టెక్కలిపట్నం సమీపంలోని మోదుగులపుట్టి గ్రామం వద్ద పలాస నియోజకవర్గంలో వంశధార ప్రవేశించింది. జలకళతో ఉన్న కాలువను చూసేందుకు అన్ని ప్రాంతాల నుంచి నాయకులు, శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆమె సంకల్పంలో మొట్టమొదటిది ప్రతి చేనుకి నీరు కార్యక్రమం విజయవంతం అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

- జోగ మల్లేష్, టీడీపీ నాయకుడు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ.

రేపటి కోసం
తెలుగు దినపత్రిక

ఆదివారం
7-7-2024

www.Repatikosam.com

## ఆమె కృషి ఎనలేనిది...



వంశధార ఎడమ కాలువలోని పూడికను తొలగించి పలువురు అధికారులతోను, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సాయంతో బాగు చేయించారు. పలు సమీక్ష సమావేశాలు నిర్వహించి, కలెక్టర్, జిల్లా అధికారులను ఈ ప్రాంతానికి రప్పించి... ఎలాగైనా ఆగష్టులోగా వంశధార కాలువలో నీరు రప్పించి, ఇక్కడున్న చెరువులను నింపితే రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష భావించారు. అందుకనుగుణంగా అడుగులు వేశారు. ఎంతో కృషి చేశారు. రైతన్న కోసం తపన పడ్డారు. అయితే గత ఐదేళ్లుగా అప్పటి శాసనసభ్యుడు కాకమ్మ కబుర్లు చెబుతూ కాలయాపన చేశారే తప్ప రైతుకు న్యాయం చేయలేదు. మంత్రిగా విధులు నిర్వహించిన వ్యక్తి ఐదేళ్లలో చేయలేని పనిని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన గౌతు శిరీష పట్టుమని నెల రోజులు కూడా పూర్తికాకుండానే వంశధార ఎడమ ప్రధాన కాలువ నుంచి రైతులకు నీరందించడం ఆమె కృషికి తార్కాణం. ఈ ప్రాంతంలోని సాగునీటి వనరుల్లో ఎక్కడా పూడిక తీసిన పాపాన పోలేదని, జంగిల్ క్లియరెన్స్ అసలే చేపట్టలేదని, పంటకు నీరివ్వాలనే జ్ఞానం లేకుండా వ్యవహరించడం సిగ్గుచేటు.

**- వజ్జ బాబూరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి.**


## ఆ పాపం.. కొండల రాజుదే !




గత ఐదేళ్లుగా వంశధార నీటిని రైతులు మర్చిపోయారంటే ఆ పాపం.. మాజీ మంత్రి కొండలరాజు అప్పలరాజుదే. అచ్చెన్నాయుడు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కార్యాలయానికి కూడా వెళ్లకుండా మోదుగులపుట్టి గ్రామం వద్దకు వచ్చి ఇక్కడి స్థితిగతులను అంచనా వేశారు. 56 కిలోమీటర్ల మేర పూడికలు తీయించారు. గతంలో అప్పలరాజు ఆయనపై పనికిమాలిన అసత్య ఆరోపణలు చేశారు. వంశధార కాలువ ఏర్పడ్డాక జూలై 6కి నీరు రాలేదు. నీరందించినందుకు ధన్యవాదాలు. ఇందుకు కృషి చేసిన టీడీపీ, జనసేన నాయకులకు ధన్యవాదాలు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓడిపోయిన అప్పలరాజు ఈ కాలువ దగ్గరకు వస్తే బంగాళాఖాతంలో కొట్టుకుపోవడం ఖాయం. అంత సమృద్ధిగా నీరొస్తుంది. రైతుల బాధలేంటో మీకు తెలుసా. అవకాశముంటే ఈ కాలువను కబ్జా చేసి విక్రయించేస్తావేమో. మీరు.. మీ నలుగురు కలసి అందుకే ఈ ఐదేళ్లు బాగా కృషి చేశారు. రైతుల కోసం ఏనాడూ మీరు ఆలోచించలేదు. జీవితంలో ఇకపై ఎన్నికల రణరంగంలోనూ, ప్రజాక్షేత్రంలో ఉండకూడదని హెచ్చరిస్తున్నా.

**- డాక్టర్ వి.దుర్గారావు,**
**జనసేన నాయకుడు, పలాస.**

## మిస్టర్ అప్పలరాజు.. ఐదేళ్ల పాటు రైతులను తొక్కేశావు



మిస్టర్ అప్పలరాజు అనుకోకుండా ఎమ్మెల్యే అయ్యావు.. మంత్రిగా మారావు. కానీ ఈ ప్రాంత రైతులకు మీ హయాంలో వంశధార నీటిని అందించలేకపోయావు. చూడు అప్పలరాజు... దీన్నే నీరంటారు. రైతుల కళ్లలో ఆనందాన్ని చూసేవారినే రైతు పక్షపాతి అంటారు. ఆ పదానికి ఎమ్మెల్యే గౌతు శిరీషమ్మ నిజమైన అర్హురాలు. అనుకోకుండా అప్పలరాజు ఎమ్మెల్యే అయ్యారు కాబట్టే... ప్రజా సమస్యలు పట్టలేదు. రైతు సమస్యలపై దృష్టి సారించలేదు. శిరీషమ్మ రైతు పక్షపాతి అని నిరూపించిన రోజు ఈ రోజు. ఖరీఫ్ సీజన్‌లో ఈ సమయానికి వంశధార ఎడమ కాలువ నుంచి నీరు తెప్పించడమంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు. కానీ మా మహిళా నేత... సాధించి చూపారు. సైరన్ వేసుకుంటూ వీధుల్లో గుయ్...గుయ్‌మని కార్లలో తిరగడం కాదు. ఇది నీరు తెచ్చే పద్ధతి. ఏ రోజైనా అధికారులతో గాని తోటి ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ మాట్లాడావా? ఒక్క సమీక్ష చేశావా? ఇవేమీ చేయలేదు. సాగునీరడిగిన రైతును సర్వనాశనం చేశావు. వజ్రపుకొత్తూరు మండలంలోని సర్వసభ్య సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షునిగా నేను ఆరోజు అధికార పార్టీలో ఉన్నప్పటికీ రైతులకు సాగునీటిని ఎందుకివ్వలేదని అడిగాను. రైతులకు నీరడిగినందికు నాపై కక్ష కట్టావు. ఇది నీచమైన మీ గుణం. సరదాగా ఓ సారి ఈ కాలువ దగ్గరకు వచ్చి చూడు. నీరు ఏ స్థాయిలో వెళ్తుందో. అన్నం పెట్టే రైతన్నను నాశనం చేయాలని చూశావు. నీరిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతమైపోతే నీ మాట వినరని భయం. అందుకే వారిని అలా ఐదేళ్లపాటు తొక్కేశావు. సిగ్గుపడు... రాజకీయాలు చేయడం మానెయ్. ఈ ప్రాంత సమస్యల పరిష్కారం చేయలేని వ్యక్తివి నీవు. ఇక ఇంట్లో కూర్చో.

**- దువ్వాడ హేంబాబు చౌదరి, టీడీపీ నాయకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వజ్రపుకొత్తూరు మండలం.**

## ఎమ్మెల్యే శిరీషమ్మకు ధన్యవాదాలు



శుభదినం. గత ఐదేళ్లుగా వంశధార చుక్క నీరు రాలేదు. పలాస నియోజకవర్గంలోకి వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీరు రావడం రైతులంతా ఎంతో ఆనందంగా ఉన్నారు. గంగమ్మతల్లికి... ఆ గంగమ్మ తల్లిని తీసుకుచ్చిన మా ఎమ్మెల్యే గౌతు శిరీషకు నమస్కారాలు. పలాస నియోజకవర్గంలోకి వస్తున్న జలాలకు మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. గత ఐదేళ్లుగా రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే గౌతు శిరీష జిల్లా కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు వివరించారు. సాగునీటి ఆవశ్యకతను వివరించారు. జిల్లా అధికారులతో సమావేశమైన ప్రతి సందర్భంలోనూ సాగునీటి అవసరతను గుర్తు చేస్తూనే ఉన్నారు. కార్యక్రమానికి సహకరించిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు. కూటమి ప్రభుత్వమంటే ప్రజా ప్రభుత్వం. ప్రజల సమస్యలను పరిష్కరించడంలోనే ముందుంటుందని మరోసారి రుజువు చేశారు. అయితే ఈ ప్రాంతమంతా పండగ వాతావరణం చోటుచేసుకుంది.

**- దువ్వాడ శ్రీహర్ష నాయుడు, టీడీపీ నాయకుడు, లక్ష్మీపురం.**

## శిరీషమ్మ సంకల్ప బలానికి జోహార్లు



శిరీషమ్మ సంకల్ప బలానికి నేడు సమాధానం వంశధారలోని ఆ గంగమ్మతల్లి. గత ఐదేళ్లలో పలాస నియోజకవర్గంలో సుమారు 45 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందక ఇబ్బందులు పడిన పరిస్థితులున్నాయి. గతంలో గౌతు శ్యామసుందర శివాజీ శాసనసభ్యునిగా మందస మండలంలో అనేక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. గత ఐదేళ్లలో ఆ ప్రాజెక్టులకు కనీసం షట్టర్లు మరమ్మతులకు గురైతే బాగు చేయించక నిర్దాక్షిణ్యంగా విడిచిపెట్టేసి భజనలతో కాలక్షేపం చేశారు మాజీ మంత్రి అప్పలరాజు. 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వంపైన, జిల్లా అధికారులపైన, ఇరిగేషన్ మంత్రిపైన ఒత్తిడి చేసి మరీ వజ్రపుకొత్తూరు మండలంలోని శివారు ప్రాంతానికి సాగునీటిని తీసుకొచ్చి సస్యశ్యామలం చేసిన ఘనత ఆనాటి ఎమ్మెల్యే శివాజీదైతే... మళ్లీ ఆ ఘనత సాధించిన వ్యక్తి ఆయన కుమార్తె.. ప్రస్తుత పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష. **ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని** అనే నినాదంతో ఎమ్మెల్యే ముందుకు వెళ్తున్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకం, విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నారు.

**- పిరికట్ల విఠల్‌రావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి.**

## డెడికేషన్ అంటే ఇదీ...



పలాస నియోజకవర్గ ఎమ్మెల్యేగా గౌతు శిరీష బాధ్యతలు స్వీకరించి నెల రోజులు కూడా పూర్తవ్వలేదు. కానీ తాను ఇచ్చిన హామీల్లో ప్రధానమైన హామీని నెరవేర్చేందుకు వడివడిగా అడుగులు వేశారు. పలాస నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందించేందుకు ఉన్న వనరులన్నింటినీ పరిశీలించారు. ఈ నేపథ్యంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వంశధార ఎడమ ప్రధాన కాలువ గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురవ్వడంతో ఆగమేఘాల మీద కాలువ మరమ్మతులు చేయించారు. ఇందుకుగాను వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా అధికారులు తోడ్పాటునందించారు. నాయకురాలు అంటే ఇలా ఉండాలి అని రుజువు చేశారు శిరీష. గత పాలకుడు మాత్రం నిత్యం వ్యక్తిగత కక్షలు, దౌర్జన్యాలు చేస్తూ కాలం గడిపేశారే తప్ప రైతు కోసం ఏనాడూ ఆలోచన చేయలేదు. అందుకే ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పి ఇంట్లో కూర్చోబెట్టారు.

**- బడ్డ నాగరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ.**

## మంచి చేయాలనే తలంపుతో....



ప్రజలకు మంచి చేయాలనే మంచి తలంపుతో రాజకీయాల్లోకి వచ్చారు గౌతు శిరీష. పలాస ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ప్రతి చేనుకు నీరు అనే తన సంకల్పానికి కార్యరూపమిచ్చారు. ఇందుకు గాను ఆమె ఎంత కష్టపడి పనిచేసి ఉంటారు? ఈ రోజు వంశధార ఎడమ ప్రధానకాలువ జలకళతో ఉట్టిపడుతోంది. గతంలో కళావిహీనంగా ఉన్న ఆ కాలువ ప్రస్తుతం తన పూర్వ రాజసంతో నిండుగా అన్నదాతను ఆదుకోవడానికి వెళ్తుందా అన్నట్టుంది. ఈ రోజు పండగ రోజు. రైతుల కల నేరివేర్చిన ఘనత శిరీషమ్మదే.

**- సప్ప నవీన్‌కుమార్, టీడీపీ పట్టణ కార్యదర్శి,**
**పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ.**


## పండగ వాతావరణం...



పలాస మండలం, టెక్కలిపట్నం సమీపంలోని మోదుగులపుట్టి గ్రామం వద్ద పండగ వాతావరణం నెలకొంది. వంశధార ఎడమ కాలువ జలకళతో కళకళలాడుతుంటే కూటమి నాయకులంతా పాలాభిషేకం చేశారు. పసుపు, కుంకుమలతో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గత ఐదేళ్ల నిరీక్షణకు ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష ఓ చక్కని సమాధానమిచ్చారు. ఇది ఆమె సామర్థ్యానికి ఓ నిదర్శనం. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఆమెకున్న పట్టుదలకు ఓ మచ్చు తునక.

**- టంకాల రవిశంకర్‌గుప్తా,**
**టీడీపీ నాయకుడు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ.**























# ఆమే.. ఒక సైన్యం



- ఒంటరి మహిళ పథకం ఆవిర్భావంలో ప్రముఖపాత్ర
- మరోవైపు పార్టీ శ్రేణులతో మమేకం
- మాజీ మంత్రి అవినీతి, దోపిడీపై సమరశంఖం
- పలాస నియోజకవర్గంలో పట్టు సాధించిన మహిళా నేత
- ప్రజా సమస్యల పరిష్కారం దిశగా...

**రేపటికోసం, పలాస :**

ఉత్తరాంధ్ర నుంచి ఎగసిపడ్డ రాజకీయ కెరటం ఆయన... జీవితాంతం బలహీనవర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన పేదల ఆశాజ్యోతి ఆయన... దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి ఆయనే... ఆ రాజకీయ మహా శిఖరం సర్దార్ గౌతు లచ్చన్న... స్వాతంత్ర్య సమరయోధుడిగా, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగాను, రాజకీయ నాయకుడిగాను గౌతు లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయన్ను మహనీయునిగా నిలబెట్టింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో తిరుగులేని నాయకుడిని సిక్కోలు అందించింది. ఇంతింతై వటుడింతై అన్న మాదిరిగా సిక్కోలు ఖ్యాతిని దేశ నలుదిశలా చాటిన మహోద్యమనేతగా సర్దార్ గౌతు లచ్చన్న చిరస్థాయిలో నిలిచిపోయారు. మనకు దూరమై దశాబ్దాల కాలం దాటుతున్నా ఆ స్ఫూర్తిని రగిలిస్తూనే ఉన్నారు. ఆ మహనీయుడి స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు ఆయన మనుమరాలు గౌతు శిరీష.

## ప్రజాసేవకు మొగ్గు..

ఆ మహనీయుడు ఆశయసాధనకు అనూహ్యంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు గౌతు శిరీష. బంగారు బాట ఉన్నా.. విద్యాధికురాలిగా ఉద్యోగపరంగా మంచి కుటుంబ జీవితం ఉన్నా.. సమాజ సేవకు అడుగులు వేశారు. ముళ్ల కిరీటం అని తెలిసినా రాజకీయ రంగాన్నే ఎంచుకున్నారు. తాతకు తగ్గ మనుమరాలిగా, తండ్రికి తగ్గ తనయిగా అనతికాలంలోనే గుర్తింపు సాధించారు. పురుషాధిక్య ప్రపంచంలో.. అందునా రాజకీయాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో వెన్ను చూపలేదు. వెనక్కి తగ్గలేదు. ఓటమిని లెక్కచేయలేదు. ప్రజల సంక్షేమమే పరమావధిగా భావించారు. ప్రజాసేవ వైపు నిష్కలంక మనసుతో అడుగులు వేస్తున్నారు. ప్రజల మనసును గుర్తెరిగి.. వారి సమస్యలపై పోరాడుతూ అపూర్వ విజయాన్ని అందుకున్నారు గౌతు శిరీష.

## అనూహ్యంగా పొలిటికల్ ఎంట్రీ..

ఆమె రాజకీయరంగ ప్రవేశమే అనూహ్యం. గౌతు శివాజీ గారాలపట్టి ఆమె. రాజకీయాలను దగ్గర నుంచి చూసిన ఆమె అవపోషణ పట్టారు. తాత సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాన్ని పుణికి పుచ్చుకున్నారు. ప్రాథమిక స్థాయి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకున్నారు. ఆ గుణమే ఆమెను రాజకీయాల వైపు మళ్లించింది. ఆమె పొలిటికల్ ఎంట్రీ యాదృచ్ఛికమే అయినా.. అది దైవ సంకల్పంగా భావిస్తారు ఆమె.

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ఆమె ఒక సాధారణ గృహిణి. తండ్రి గౌతు శివాజీ పలాస ఎమ్మెల్యే. అప్పుడే ఆమె మదిలో ఒక ఆలోచన మొదలైంది. మహిళా సంక్షేమమే ధ్యేయంగా ఆలోచించే చంద్రబాబుకు ఓ విషయం చెప్పాలని భావించారు. రాష్ట్రంలో ఏ ఆదరణ లేని లక్షలాది మంది ఒంటరి మహిళలకు ప్రభుత్వం అండగా నిలబడితే బాగుంటుందని సలహా ఇచ్చారు. భర్త ఆదరణ లేని వారు... పిల్లలు విడిచిపెట్టిన వారు... కుటుంబసభ్యులు పట్టించుకోని మహిళలు పడే బాధలు వర్ణనాతీతం. అటువంటి వారికి ప్రభుత్వం సామాజిక చేయూత కల్పిస్తే బాగుంటుందని తన అభిప్రాయాన్ని కుండబద్దలుకొట్టారు. ఆమె ఆలోచనను చంద్రబాబు గౌరవించారు. **'ఒంటరి మహిళలకు పెన్షన్'** పథకాన్ని ప్రకటించారు. అప్పుడే చంద్రబాబు మదిలో ఆమె మెదిలారు. గౌతు లచ్చన్న వారసురాలుగా ప్రతిబింబించారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు పిలిచి మరీ టిక్కెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ఆమె వైసీపీ ఒక్కఛాన్స్ నినాదంలో నెగ్గుకు రాలేకపోయారు. అయితే 2014లో నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా 40,350 ఓట్ల భారీ మెజార్టీతో ఓ మంత్రినే ఓడించి... తన స్టామినాను నిరూపించుకున్నారు శిరీష. ఇక అప్పట్నుంచి నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసమే పని చేస్తున్నారు. హంగులూ, ఆర్భాటాలకు దూరంగా ఉండే గౌతు శిరీష తనదైన శైలిలో సమస్యలను పరిష్కరిస్తూ అపూర్వ ప్రజాభిమానాన్ని పొందుతున్నారు. ఇందులో భాగంగానే రైతుల చిరకాల వాంఛ అయిన సాగునీటిని కేవలం పదిహేను రోజుల్లో మంత్రి అచ్చెన్న, అధికారుల సాయంతో విడుదల చేయించారు.

## సిక్కోలు శివంగిలా మారి..

**గత ఐదేళ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉన్నారు. ప్రజాసమస్యలపై ఒక వైపు..మారీచులు లాంటి ప్రత్యర్థులతో గట్టి యుద్ధమే చేశారు. ఈ పోరాటంలో ఆమె సిక్కోలు శివంగిలా మారారు. ఆమె రాజకీయ ప్రయాణం పూలపాన్పు కాలేదు. దారిపొడవునా ముళ్లు, రాళ్లు దాటుకుంటూ వెళ్తున్నారు. ఎన్నో రకాల ఇబ్బందులు ఎదురవుతున్నా భయపడలేదు. కౌరవ సైన్యంతో పోరాడుతూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. బరితెగించే మాటలతో సభ్య సమాజం తలదించుకునే చేష్టలతో ప్రత్యర్థులు తూలనాడుతున్నా.. చేష్టలుడికి అచేతనంగా వ్యవస్థలున్నా.. తెగువ, ధైర్యంతో ముందుకు సాగారు. మహిళ ఏం చేస్తుందిలే అని తేలిగ్గా తీసుకున్నారు. లేనిపోని ప్రచారం చేసి పలుచన చేయాలని చూశారు. సోషల్‌మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. పోలీసు కేసులు మోపి భయభ్రాంతులకు గురిచేశారు. కానీ ఆమె వెనుకడుగు వేయలేదు. ధైర్యంగా ముందడుగు వేశారు. ఇబ్బందులను అధిగమించారు. అలుపెరగని పోరాటం చేశారు. అప్పటి అమాత్యుడు, ఆయన అనుచరుల అవినీతిపై పోరాటం చేశారు. దోపిడీని ప్రజల కళ్లకు కట్టినట్టు చూపారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. ప్రజలే స్వచ్ఛందంగా మద్దతు తెలిపేలా వారి అభిమానాన్ని చూరగొన్నారు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా పలాస నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా అవతరించారు గౌతు శిరీష. పలాస ఎమ్మెల్యేగా అపూర్వ విజయాన్ని అందుకున్న నెల రోజుల్లోనే తన మార్క్ పాలనను చూపారు. సమస్యలపై తనకున్న స్పష్టతతో పరిష్కారానికి కూడా సన్నాహాలు చేసుకుంటూ ముందుకు దూసుకుపోతూ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేస్తున్నారు.**

# టీడీపీ నాయకుల ధన్యవాద తీర్మానం







**మందస, జూలై 6 (రేపటికోసం) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మొట్టమొదటిగా పెట్టిన ఐదు సంతకాలకు ధన్యవాదాలు తెలుపుతూ టీడీపీ నాయకులు తీర్మానించారు. మందస మండలం బాలిగాం జంక్షన్‌లోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అధ్యక్షతన శనివారం మండల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష తన ఎన్నికల హామీలో భాగంగా ప్రతి చేనుకు నీరు ప్రతి చేతికి పని కల్పించాలనే మంచి ఉద్దేశంతో వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు టెక్కలిపట్నం చేరుకున్న సందర్భంగా శిరీషమ్మ కృషికి ధన్యవాదాలు తెలియజేస్తూ తీర్మానించారు. అలాగే నాయకులు కార్యకర్తలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడంపై తీర్మానించారు. 2014 నుంచి 2019 మధ్యకాలంలో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించాలని కోరుతూ తీర్మానించారు. సమావేశంలో జి.కె.నాయుడు, దాసరి తాతారావు, కొర్ల కన్నారావు, రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య, ముడుమించి నవీన్ కుమార్, ముంజేటి చంద్రశేఖర్, రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీ సభ్యులు, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రాణం ఎంతో విలువైనది : జడ్జి మాధురి

**పలాస, జూలై 6 (రేపటికోసం) :** ప్రాణం ఎంతో విలువైనదని హెల్మెట్ ధరించడంతో చాలా వరకు ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చుని... జూనియర్ సివిల్ జడ్జి యు. మాధురి పిలుపునిచ్చారు. హైకోర్టు, జిల్లా లీగల్ సెల్ సర్వీస్ ఆధారిటి వారి ఆదేశాల మేరకు పలాస జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి మాధురి ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో శనివారం సాయంత్రం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆటో డ్రైవర్స్ రోడ్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్ రాజు, కోత రజనికుమార్, జి.ప్రభాకర్, శ్యామ్, రవి, ఇన్ చార్జి సూపరింటెండెంట్ ఎస్వీ సంతోష్ కుమార్, కోర్ట్ సిబ్బంది, ఏఎస్ఐ ప్రకాష్, కోర్ట్ కానిస్టేబుల్ నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# బాబూ జగజ్జీవన్‌రామ్‌కు నివాళులు

**ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు బాబూ జగజ్జీవన్‌రామ్ అని టీడీపీ నాయకులు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారరు.**

**- రేపటికోసం, పలాస.**



Printed by **BOPPANA VIJAYA KUMAR**, Published by **BOPPANA VIJAYA KUMAR**, Owned by **BOPPANA VIJAYA KUMAR**, Printed at Prajashakti Printers & Publishers Private Limited. D.NO.14-12-19, Krishnanagar, Tadepalli (P&M), Guntur District, Andhra Pradesh. Published at 169/1A, FLAT NO.503, Varun Residency, LB Nagar, Ippatam Road, MANGALAGIRI, GUNTUR DISTRICT, Andhara Pradesh-522503. RNI no. APTEL/2018/75566